


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




బుధవారం 23-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :97 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## వందేమాతరంపై సుప్రీం స్పష్టత!




2 లో

వందేమాతరం చరణాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం

అన్ని చరణాలు పాడనివారిపై చర్యలు తీసుకోలేరని వ్యాఖ్య

కేంద్రం చట్టసవరణ, మార్గదర్శకాలపై నోటీసులు

రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని కేంద్రానికి ఆదేశం

టి.ఎం. కృష్ణ పిటిషన్‌పై సీజేఐ ధర్మాసనం విచారణ

మత విశ్వాసాలకు రాజ్యాంగ రక్షణ ఉందన్న సుప్రీంకోర్టు

## జగన్ ఇలాకాలో కూటమి స్కెచ్

సునీతకు లోకేశ్ ఆఫర్?

జడ్పీ చైర్‌పర్సన్ పదవిపై ప్రచారం

లింగాల నుంచే బరిలోకి దింపే యోచన

సునీత వైపు కూటమి చూపు

సొంత గడ్డపై జగన్‌కు చెక్

స్థానిక ఎన్నికలకు ఎస్ఈసీ కసరత్తు

త్వరలో ఏపీలో లోకల్ వార్



2 లో

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైన వేళ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రెండున్నరేళ్ల తర్వాత జరగబోతున్న లోకల్ వార్‌ను కూటమి పార్టీలు రెఫరెండంగా భావిస్తుండగా.. మెజార్టీ స్థానాల్లో పట్టు సాధించేందుకు వైసీపీ వ్యూహాలు రచిస్తోంది. క్రమంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆయన సొంత గడ్డపైనే దెబ్బకొట్టేందుకు అధికార కూటమి పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డిని రంగంలోకి దించేందుకు మంత్రి నారా లోకేశ్ ఆఫర్ ఇచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

**జిల్లా చైర్ పర్సన్ పోస్టు ఆఫర్?:**

జగన్ సొంత మండలమైన లింగాలలో జెడ్పీటీసీగా పోటీ చేయాలని, గెలిస్తే ఆమెకు జిల్లా జడ్పీ చైర్ పర్సన్ పోస్టును ఆఫర్ చేసినట్లు ప్రచారం సాగుతోంది.

## క్యూర్ బిల్లుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్!

జీహెచ్ఎంసీ చట్టానికి కొత్త రూపం

క్యూర్-2026 చట్టం అమల్లోకి

ఒకే నగరం.. ఒకే పరిపాలన

మూడు కార్పొరేషన్లకు ఏకీకృత పాలన

హైడ్రాకు చట్టబద్ధ గుర్తింపు

హైడ్రాకు అదనపు అధికారాలు

డిజిటల్ పాలనకు కొత్త అడుగు

2 లో

## ఏపీలో భారీ అభివృద్ధి పనులు!

రూ.11,359 కోట్ల పనులకు శ్రీకారం

వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు

123 మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు

తొలిసారి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్

రహదారులకు రూ.4,656 కోట్ల కేటాయింపు

పార్కులు, వీధి దీపాలకు నిధులు

పట్టణ మౌలిక వసతులపై ప్రత్యేక ఫోకస్

పనులపై నేతలే బాధ్యత వహించాలి



2 లో

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా రూ.11,359 కోట్ల విలువైన భారీ అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన, అక్కడి నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 123 మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

## కావేరీ జలాలపై సుప్రీం షాక్!

కర్ణాటకకు 70 టీఎంసీల పిటిషన్ కొట్టివేత

ప్రైవేట్ సొసైటీలకు షాక్

అంతర్రాష్ట్ర జల వివాదాల్లో జోక్యం కుదరదు

థర్డ్‌పార్టీల పిటిషన్లు చెల్లవన్న కోర్టు

రెండు రాష్ట్రాలకే హక్కు

పెండింగ్ కేసులపై సుప్రీం స్పష్టత

కొత్త వ్యాజ్యాలకు తావులేదన్న న్యాయస్థానం

2 లో

## కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు షురూ!

అక్టోబర్ నుంచి కొత్త పెన్షన్ల పంపిణీ

దసరాకు ముందే లబ్ధిదారులకు పింఛన్లు

కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని సూచన

వెరిఫికేషన్‌లో జాప్యం లేకుండా అదనపు సిబ్బంది

ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రత్యేక ప్రాధాన్యత

దసరా నాటికి పంపిణీ పూర్తి చేసేలా కసరత్తు

2 లో


## ఏనుగు పిల్లను కాపాడిన మత్స్యకారులు!



2 లో

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** పశ్చిమ బెంగాల్‌లోని జల్పైగురి జిల్లాలో మానవత్వం చాటే అద్భుతమైన సంఘటన వెలుగు చూసింది. మాల్‌బజార్ బ్లాక్ పరిధిలోని బైకంఠాపూర్ అటవీ ప్రాంతం సమీపంలో ప్రవహిస్తున్న టీస్టా నదిని ఏనుగుల గుంపు దాటుతుండగా, నీటి ఉధృతికి ఒక చిన్న ఏనుగు పిల్ల కొట్టుకుపోయింది.

## తీవ్ర వాయుగుండం.. హై అలర్ట్!



2 లో

23, 24 తేదీల్లో పలు జిల్లాల్లో అతిభారీ వర్షాల హెచ్చరిక

కాకినాడ, కోనసీమ సహా ఐదు జిల్లాలకు రెడ్ అలెర్ట్

ఉత్తరాంధ్రలో ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

విశాఖ-గోపాలపూర్ మధ్య తీరం దాటే అవకాశం

గంటకు 60 కి.మీ వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక

ఈ నెల 25 వరకు సముద్ర వేటకు వెళ్లొద్దని

మత్స్యకారులకు సూచన




# కవిత వెనుక 'హస్తం'..?

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవితను కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి నడిపిస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆరోపించింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు లేవనెత్తింది. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో కవిత నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ సందర్భంగా జరిగిన ఏర్పాట్లు, ఆమె ప్రయాణించిన బస్సు అంశాలను ప్రస్తావించింది. కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సెప్టెంబర్ 20న కవిత ఆధ్వర్యంలో పాంచజన్య సంకల్ప సభ జరిగింది. సభలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తాను ఎవరి బాణాన్నీ కాదని, తెలంగాణ బహుజనుల బాణమని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉచిత విద్య, వైద్యం, సాగునీరు, సామాజిక న్యాయం తదితర అంశాలపై తన రాజకీయ కార్యాచరణను వివరించారు.

మిగతాది 2 లో..

- కవిత వెనుక కాంగ్రెస్ హస్తమా?
- కవిత సభపై టీఆర్‌పీ సంచలన ఆరోపణలు
- కోస్గి సభ ఏర్పాట్లపై కొత్త చర్చ
- జన సమీకరణ వెనుక ఎవరున్నారు?
- కవిత ప్రచార రథంపై రాజకీయ రగడ
- కాంగ్రెస్ నేతకు చెందిన బస్సేనా?
- కవిత కోసం బస్సు ఎలా వచ్చింది?
- బస్సు కస్టమైజేషన్‌పై టీఆర్‌పీ ప్రశ్నలు
- కవిత వెనుక ఎవరున్నారు?

## పిఠాపురానికి పవన్ వరాల జల్లు!

పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం

రూ.1500 కోట్ల అభివృద్ధి పనులు

రూ.225 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

డంపింగ్ యార్డు సమస్యకు చెక్

ఆలయాల అభివృద్ధికి రూ.34 కోట్లు

97 వేల మందికి తాగునీరు

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, బ్యాగులు

సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు భరోసా



2 లో

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో రెండోరోజు పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సుమారు రూ.1500 కోట్ల విలువైన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా తొలుత గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకుని, ఏకాదశి వ్రతాచరణ నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ ఆలయాభివృద్ధికి రెండు విడతలుగా రూ.90 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో నిర్మించిన కాలక్షేప మండపం, రథశాల, యాగశాల, అన్నదాన హాలు పనులను పరిశీలించారు.

## తొలిసారి.. హైపవర్ భేటీ!

రేవంత్ అధ్యక్షతన కీలక సమీక్ష

అట్రాసిటీ కేసులపై సీఎం ఫోకస్

కేసుల దర్యాప్తుపై ఆరా

బాధితుల పరిహారంపై సమీక్ష

ప్రత్యేక కోర్టుల పనితీరుపై చర్చ

చట్టంపై అవగాహనకు దిశానిర్దేశం

ఉన్నతాధికారులతో సీఎం కీలక భేటీ



2 లో

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశం సచివాలయంలో ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే తొలి సమావేశం కావడం విశేషం. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన చివరిసారిగా ఈ కమిటీ చివరి సమావేశం జరిగింది. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి హోదాలో ఈ స్థాయి హైపవర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 23-09-2026

# పిఠాపురానికి పవన్ వరాల జల్లు!

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత ఆర్ఆర్ బిహెచ్ఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఇళ్ల పట్టాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు, మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు సహా రక్షణ పరికరాలు అందజేశారు. అలాగే పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్‌ను కలిసిన రైతు సంఘాల ప్రతినిధులు ఆయనకు నాగలిని కానుకగా ఇచ్చి తమ కృతజ్ఞతలు తెలిపారు.

సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించడంతో పాటు రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా రూ.34 కోట్లతో నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల పునరుద్ధరణ, రూ.2 కోట్లతో కుంతీ మాధవస్వామి ఆలయ కోనేరు ఆధునీకరణ మరియు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాల ఏర్పాటు వంటి కీలక ప్రాజెక్టులను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. సభకు ముందు యు.కొత్తపల్లి మండలంలో రూ.9.59 కోట్లతో పునరుద్ధరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత మంచి నీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పిఠాపురం రూరల్ పరిధిలోని 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. మార్గమధ్యంలో కొండేవారంలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయి కనెక్షన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

# క్యూర్ బిల్లుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్!




**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో సమర్థవంతమైన పాలన, డిజిటల్ ఆధారిత వ్యవస్థగా తీర్చిదిద్దడం దిశగా కీలక అడుగు పడింది. క్యూర్ బిల్లుకు తెలంగాణ గవర్నర్ ఆమోదం తెలిపారు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లుపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీంతో జీహెచ్ఎంసీ–1955 స్థానంలో క్యూర్ -2026 చట్టం అమల్లోకి రానుంది. ఒకే నగరం.. ఒకే పరిపాలన ఒకే చట్టం లక్ష్యంతో జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీల పరిధిలో వర్తించేలా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా హైడ్రాకు చట్టపరమైన గుర్తింపు, అదనపు అధికారాలు లభించనున్నాయి. క్యూర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో ఏకీకృత పాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాలం చెల్లిన, అవసరం లేని నిబంధనలను తొలగించడం ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా మార్పులు చేయడం లక్ష్యంగా క్యూర్ బిల్లును తీసుకువచ్చారు.

# తొలిసారి.. హైపవర్ భేటీ!

మొదటి పేజీ తరువాయి

సచివాలయంలో జరిగిన ఈ కీలక భేటీలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరుతెన్నులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో విస్తృతంగా సమీక్షించారు.

కేసుల నమోదు, దర్యాప్తు..

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రత్యేకంగా చర్చించారు. బాధితులకు అందాల్సిన నష్టపరిహారం, ఆర్థిక సహాయం, పునరావాస చర్యలు సమర్థవంతంగా అమలు జరుగుతున్నాయా లేదా అన్న అంశాలపై ఆరా తీశారు. కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరును సమీక్షించారు. చట్టంపై క్షేత్రస్థాయిల్లో ప్రజలకు, సంబంధిత అధికారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య హాజరయ్యారు. వారితో పాటు ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళి నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాల్గొన్నారు. పరిపాలనా యంత్రాంగం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీపీ ఆనంద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లు, సభ్యులు, పలువురు ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

# ఏపీలో భారీ అభివృద్ధి పనులు!

మొదటి పేజీ తరువాయి

రూ.11,359 కోట్ల కేటాయింపుల వివరాలు


రాష్ట్రంలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఈ అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతోంది. 123 మున్సిపాలిటీల పరిధిలో రూ.7,469 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం పరిధిలోనే రూ.3,890 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను ప్రారంభించారు. రహదారుల విస్తరణ, మరమ్మతుల కోసం రూ.4,656 కోట్లు కేటాయించారు. పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించారు. పట్టణాల్లో వీధి దీపాల ఏర్పాటుకు రూ.247 కోట్లు వెచ్చించనున్నారు.

అభివృద్ధి పనుల్లో నాయకులే బాధ్యత వహించాలి: సీఎం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేసరికి ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అయితే కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తెస్తున్నామని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని, ఎచ్ఏఎం మోడల్ ద్వారా వినూత్నంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రతి మంచి పనిని కొంతమంది కావాలనే తప్పుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పట్టణ, స్థానిక సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. "తమ పరిధిలోని అభివృద్ధి పనులకు స్థానిక రాజకీయ నాయకులే పూర్తి బాధ్యత వహించాలి. మున్సిపల్ కమిషనర్లు, అడ్మినిస్ట్రేటర్లు క్షేత్రస్థాయిలో ఉండి ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలి" అని సూచించారు.

# ఏనుగు పిల్లను కాపాడిన మత్స్యకారులు!

మొదటి పేజీ తరువాయి



గజోల్‌డోబా పరిసరాల్లో నదిలో చేపల వేటకు వెళ్లిన స్థానిక మత్స్యకారులు నది ప్రవాహంలో కొట్టుకుపోతూ ప్రాణాల కోసం అల్లాడుతున్న ఏనుగు పిల్లను గమనించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తమ చిన్న పడవను అటువైపు పోనిచ్చి, తీవ్రంగా శ్రమించి ఆ ఏనుగు పిల్లను సురక్షితంగా పడవపైకి ఎక్కించి ఒడ్డుకు చేర్చారు.

ఈ విషయాన్ని మత్స్యకారులు తక్షణమే బైకంఠాపూర్ అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, ఆ ఏనుగు పిల్లను అడవి మార్గంలో కాపుకాసి ఉన్న తల్లి ఏనుగు, దాని గుంపు వద్దకు సురక్షితంగా చేర్చారు. తమ బిడ్డ క్షేమంగా తిరిగి రావడంతో తల్లి ఏనుగు సంబరపడిపోతూ పిల్లతో కలిసి దట్టమైన అడవిలోకి వెళ్ళిపోయింది. కాగా దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి మూగజీవి ప్రాణాలను కాపాడిన మత్స్యకారుల సాహసాన్ని, వారి గొప్ప మనసును అటవీ శాఖ అధికారులు, నెటిజన్లు కొనియాడుతున్నారు.

# వందేమాతరంపై సుప్రీం స్పష్టత!




**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** వందేమాతరం గీతాలాపనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరం ఒక చరణం పాడాలా లేక నాలుగు చరణాలు పాడాలా ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేసింది. వందేమాతరం 6 చరణాలు ఆలాపనను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడంపై ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు టి.ఎం కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్?పై మంగళవారం విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం.. అన్ని చరణాలు పాడని వారిపై శిక్షాత్మక చర్యలు తీసుకోలేరని వ్యాఖ్యానించింది. కేంద్రం విధించే శిక్షాత్మక చర్యల అంశాన్ని పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు.. వందేమాతరం సవరణ చట్టం, మార్గదర్శకాలపై కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని పేర్కొంది. పౌరుల మత విశ్వాసాలకు రాజ్యాంగ రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది.

**పొలిటికల్ వివాదం వేళ సుప్రీం కీలక వ్యాఖ్యలు:**

గత 70 ఏళ్లుగా వందేమాతరంలో మొదటి రెండు చరణాలు మాత్రమే ఆలపించే ఆనవాయితీ ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇటీవల మొత్తం ఆరు చరణాల ఆలాపనను తప్పనిసరి చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. అంతేకాకుండా, దీనికి 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా కల్పిస్తూ, ఆలాపనకు అంతరాయం కలిగిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టసవరణ తెచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు టి.ఎమ్. కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చివరి నాలుగు చరణాల్లో నిర్దిష్ట మతపరమైన అంశాలు ఉన్నందున, వాటిని బలవంతంగా పాడించాలని చూడటం రాజ్యాంగం ప్రసాదించిన లౌకికత్వానికి, మతస్వేచ్ఛకు మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. వందేమాతరం అంశం దేశవ్యాప్తంగా రాజకీయంగానూ హాట్ టాపిక్ గా మారిన వేళ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

# జగన్ ఇలాకాలో కూటమి స్కెచ్

మొదటి పేజీ తరువాయి



2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జగన్‌కు వ్యతిరేకంగా కడప ఎంపీగా పోటీ చేసిన వైఎస్ షర్మిలకు సునీత మద్దతు ప్రకటించారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల నేపథ్యంలో కూటమి వైపు ఆమె అడుగులు వేస్తారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జగన్‌ను ఆయన సొంత ఇలాకాలోనే రాజకీయంగా ఇరుకున పెట్టే వ్యూహంలో భాగంగా సునీతను రంగంలోకి దింపాలని కూటమి భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రచారంపై సునీత నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఆమె స్వయంగా ఎన్నికల బరిలోకి దిగుతారా? లేక తన కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా పోటీకి దింపుతారా? అన్నది తేలాల్సి ఉంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం:

మరోవైపు ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేసింది. తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫొటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఇప్పటికే ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. 2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించి ఓటర్ల జాబితాల తయారీకి ఆదేశించింది. తుది ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 22న ప్రచురించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే మరో 59 మున్సిపాలిటీలకు ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ కావడంతో పురపాలక ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. దీంతో త్వరలోనే ఏపీలో స్థానిక ఎన్నికల నగారా మోగనుండగా కూటమి వర్సెస్ వైసీపీ మధ్య రాజకీయం ఆసక్తిని రేపుతోంది.

# కావేరీ జలాలపై సుప్రీం షాక్!




**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** కర్ణాటక, తమిళనాడు మధ్య వివాదాస్పద కావేరీ నది జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కర్ణాటకకు 70 టీఎంసీలు అదనంగా కేటాయించాలన్న రిట్ పిటిషన్ ను సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. ప్రైవేట్ సొసైటీల పిటిషన్లు చెల్లవని తీర్పులో స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ – పార్టీలు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని, సొసైటీల పిటిషన్లు విచారిస్తూ పోతే వివాదాలు ముగియవు అని వ్యాఖ్యానించింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయన్న కోర్టు రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని స్పష్టం చేసింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందన్న న్యాయస్థానం.. పెండింగ్ లో ఉన్న కావేరి కేసుల దృష్ట్యా కొత్త వ్యాజ్యాలకు తావులేదని తెలిపింది.

# కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు షురూ!




**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ ప్రభుత్వం అక్టోబర్ నుంచి కొత్త పెన్షన్లను పంపిణీ చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. దసరా పండుగకు ముందే లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త పెన్షన్ల అమలుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది.

మంత్రి సీతక్క ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. రాబోయే అక్టోబర్ నెల నుంచి అర్హులైన కొత్త లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. పండుగ సమయానికి ప్రజలకు మేలు జరగాలనే ఉద్దేశంతో, దసరా పండుగకు ముందే కొత్త పెన్షన్లు అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని సూచించారు. వెరిఫికేషన్ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండేందుకు, అవసరమైతే క్షేత్రస్థాయిలో అదనపు సిబ్బందిని నియమించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మొత్తం ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా చూసే బాధ్యతను సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు అప్పగిస్తూ మంత్రి తగు ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తు చేసుకున్న వారిలో పూర్తి స్థాయిలో అర్హత కలిగిన ఒంటరి మహిళలు, వితంతువులకు ఈ పథకం కింద ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి పెన్షన్లు మంజూరు చేయనున్నారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క నిజమైన అర్హులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం, మంత్రుల ఆదేశాల మేరకు యంత్రాంగం దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీని పూర్తి చేయడానికి యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఆలస్యం లేకుండా పింఛను అందేలా చూడడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

# తీవ్ర వాయుగుండం.. హైఅలర్ట్!

**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారడంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈ వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ప్రస్తుతం తీవ్ర వాయుగుండం పూరీకి సుమారు 310 కిలోమీటర్లు, కళింగపట్నానికి 390 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 470 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇది క్రమంగా వాయవ్య దిశగా కదులుతూ బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాములోపు విశాఖపట్నం–గోపాలపూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వాయుగుండం ప్రభావంతో నేడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. 23, 24 తేదీల్లో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సెప్టెంబర్ 23న కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. సెప్టెంబర్ 24న కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్ కొనసాగనుంది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. మిగిలిన కోస్తా జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోస్తా తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 25 వరకు సముద్రంలో వేటకు వెళ్లకూడదని కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

వాయుగుండం ప్రభావంతో విజయనగరం జిల్లాలో ఇప్పటికే వాతావరణం పూర్తిగా మారిపోయింది. తెల్లవారుజాము నుంచి జిల్లాలో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలని అధికారులు సూచించారు.

శ్రీకాకుళం జిల్లాకు తీవ్ర వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి ఉత్తరాంధ్ర వైపు కదులుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మరోసారి హెచ్చరించారు.

# కవిత వెనుక 'హస్తం'..?

మొదటి పేజీ తరువాయి

ఈ సభ నేపథ్యంలోనే కవిత ప్రయాణించిన బస్సుపై టీఆర్‌పీ ఆరోపణలు చేసింది. సభ ఏర్పాట్లు,జన సమీకరణ వెనుక సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా భావించే నేతల పాత్ర ఉందని పేర్కొంది. కవిత తన పార్టీ రంగులు, ఫొటోలతో కూడిన బస్సులో సభా ప్రాంగణానికి చేరుకున్నారని టీఆర్‌పీ పేర్కొంది. ఆ బస్సు కాంగ్రెస్ నేతకు చెందిన సంస్థదేనని ఆరోపిస్తూ.. ఒక రాజకీయ పార్టీ అధినేత్రి ప్రచార కార్యక్రమాల కోసం మరో పార్టీకి చెందిన నాయకుడితో సంబంధం ఉన్న సంస్థ బస్సు ఎలా అందుబాటులోకి వచ్చిందనే ప్రశ్నను లేవనెత్తింది. ఈ బస్సు బాల్కొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్‌కు సంబంధించిన తిరుమల క్యాబ్ లిమిటెడ్ సంస్థకు చెందినదని టీఆర్‌పీ పేర్కొంది.

'కవితని నడిపిస్తున్నది కాంగ్రెస్ , రేవంత్ రెడ్డి అని మరోసారి తేటతెల్లం. కొడంగల్ నియోజకవర్గ కోస్గిలో నిన్న కవిత పెట్టిన సభలో ఏర్పాట్లు, జన సమీకరణ మొత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుల నేతృత్వంలోనే జరిగిన మాట వాస్తవం. కవిత కోసం బస్ సైతం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. కేవలం కొడంగల్ మాత్రమే కాదు తెలంగాణ మొత్తం కవిత ఇక ఇదే బస్ లో ప్రయాణం చేయనున్నట్టుగా కవిత పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆరంజ్ ట్రావెల్స్ సునీల్ రెడ్డిగా ప్రచారంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడికి చెందిన బస్ కవిత పార్టీ కోసం ఎందుకు కస్టమైజ్ చేసినట్టు ? ఎవరు చేయించారు ? అసలు కవిత వెనక ఉన్నది ఎవరు? అనే ప్రశ్నలకి సమాధానం ప్రజలకి దొరికింది.' అని టీఆర్పీ ట్వీట్ చేసింది.

జుట్టు పట్టుకొని పొట్టు పొట్టు కొట్టుకున్నారు.. బస్సులో సీటు కోసం మహిళల సిగపట్లు

కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో కవిత భారీ బహిరంగ సభ నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సభకు హైదరాబాద్ నుంచి కవిత భారీ ర్యాలీగా వెళ్లారు. సభలో కవిత తనపై వస్తున్న బాణం వ్యాఖ్యలకు స్పందించారు. బీఆర్ఎస్ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి తనపై చేస్తున్న రాజకీయ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. తాను ఎవరి బాణాన్నీ కాదని స్పష్టం చేశారు. ఇప్పుడు బస్సు వ్యవహారాన్ని టీఆర్‌పీ రాజకీయ చర్చకు తీసుకురావడంతో సభ ఏర్పాట్లకు ఎవరు సహకరించారు? బస్సును ఎవరు సమకూర్చారు? వంటి ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# బీహార్‌లో నిందితుడి ఎన్‌కౌంటర్!



**న్యూస్ డెస్క్, 22 సెప్టెంబరు (ఇది కద నిజం):** బీహార్‌లోని జముయిలో ఇటీవల జరిగిన ఓ దారుణమైన లైంగిక దాడికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. యూనిఫాంలో ఉన్న ఒక పాఠశాల విద్యార్థి, విద్యార్థిని పట్ల కొందరు కుర్రాళ్ళు తీవ్రంగా బూతులు మాట్లాడుతూ, ఆ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తిస్తూ (బ్యాడ్ టచ్ చేస్తూ) గొడవ చేశారు. ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. చివరికి జాతీయ మహిళా కమిషన్ కూడా ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించి ఆరా తీసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాధ్యులైన వారిని గుర్తించి, మొదట ముగ్గురిని అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా మరో నలుగురు పరారయ్యారు.

ఈ పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా, జముయిలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు నందన్ యాదవ్, మరో నిందితుడు హరే రామ్‌లను పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై వారు ఎదురుదాడికి దిగడంతో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు నందన్ యాదవ్ కాలికి బుల్లెట్ గాయమవ్వగా, మరో నిందితుడు హరే రామ్‌కి కాలు విరిగింది. ఎన్‌కౌంటర్ అనంతరం వీరిద్దరినీ వెంటనే చికిత్స నిమిత్తం జముయి సదర్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని బీహార్ పోలీస్ లా అండ్ ఆర్డర్ ఏడీజీ కేఎస్ అనుపమ్ అధికారికంగా ధృవీకరించారు. ఈ కేసు విచారణను పోలీసులు అత్యంత వేగంగా వేగవంతం చేశారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కొత్త నేర చట్టం బిఎన్ఎస్ఎస్ లోని 128, 74, 75 సెక్షన్లతో పాటు చిన్న పిల్లలపై వేధింపుల నిరోధక చట్టం కింద సెక్షన్ 8, 12లను నమోదు చేశారు. అంతేకాకుండా, ఈ కేసును నిష్పాక్షికంగా, వేగంగా విచారించేందుకు జముయి ఎస్డీపీఓ పర్యవేక్షణలో ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. మొత్తానికి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితులపై జముయి పోలీసులు తీసుకున్న ఈ కఠిన చర్యతో స్థానికంగా పెద్ద ఎత్తున ఊరట వ్యక్తమవుతోంది.

Registered No: APTEL/25/A/2618
ఇది కద నిజం
బుధవారం 23-09-2026

# వైభవంగా వినాయకుడి పూజలు అన్నదాన కార్యక్రమం





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా హనుమాన్ మందిరం దత్త మందిర్ ల వద్ద గణనాధుడు 9వ రోజులు కొలుధీరిన వినాయకుడు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత విఘ్నేశ్వర స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడి వద్దకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనసూయ శంకర్ గ్రామ ప్రజలు మహిళలు చిన్నలు భక్తులు పాల్గొన్నారు.


# చింతలపూడి UCG ప్రాజెక్ట్‌పై ఆందోళన

## వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన రైతులు



ఇది కద నిజం: చింతలపూడి ప్రాంతంలో ప్రతిపాదించిన అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (UCG) ప్రాజెక్ట్‌పై స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులతో సమావేశమయ్యారు. తమ వ్యవసాయ భూములు, పండించే పంటలు, భూగర్భ జలాలు మరియు గ్రామాల ఉనికి ప్రమాదంలో పడతాయనే భయాందోళనలను రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. రైతుల సమస్యల తీవ్రతను గుర్తించిన విజయరాజు ఈ అంశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు చొరవ చూపారు. కంభం విజయరాజు నేతృత్వంలో చింతలపూడి మండల రైతులు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా కలిసి తమ వినతులను సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ కుటుంబాలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని తెలిపారు. ప్రాజెక్ట్ వల్ల భూగర్భ జలాలు కలుషితమై సాగునీటి వనరులు దెబ్బతింటాయేమోనని, ఇళ్లు మరియు గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తే పిల్లల భవిష్యత్తు, ఉపాధి దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన DPR, పర్యావరణ ప్రభావ అధ్యయనాల వివరాలను ప్రజల ముందుంచాలని, గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను, వారి ఆందోళనలను సానుకూలంగా వినిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వాస్తవాలు, పర్యావరణ ప్రభావం, భూములపై పడే ప్రతికూలతలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఒక పూర్తి స్థాయి నివేదికను తనకు అందించాల్సిందిగా చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజుతో పాటు దెందులూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొట్టారు అబ్బాయి చౌదరిని నిర్దేశించారు. నివేదిక అందిన తర్వాత రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పార్టీ పరంగా చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణను ఖరారు చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. తమ సమస్యను రాష్ట్ర స్థాయిలో వినిపించేందుకు సహకరించిన విజయరాజుకు ఈ సందర్భంగా రైతులు ధన్యవాదాలు తెలిపారు.

# జమ్మలమడుగు.. యర్రగుంట్ల మున్సిపాలిటీలకు 38 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన..!!




ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 22: కడప జిల్లా.. జమ్మలమడుగు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతులు, అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టినట్లు స్థానిక బిజెపి ఎమ్మెల్యే, రాష్ట్ర విప్ ఆదినారాయణ రెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడు జగన్ మాత్రం పనులను అడ్డుకుంటూ అభివృద్ధి నిరోధకుడుగా మారాడని ఘాటుగా విమర్శించారు. జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో హ్యామ్ పథకంలో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీ 22 కోట్లు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ 16 కోట్ల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులకు వర్చువల్ గా మంగళవారం శంకుస్థాపన చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి.. ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమం చేశారు. మున్సిపాలిటీల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగాన్ని కార్యకర్తలు, నాయకులు, మున్సిపాలిటీ అధికారులతో కలిసి ఎల్ఈడి టీవీ ద్వారా వీక్షించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవాళ కుప్పం నుంచి వర్చువల్ విధానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రోడ్లు, డివైడర్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించడం ఈ కొత్త పథకం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీ పట్టణాలలో వర్చువల్ గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ముమ్మరంగా కృషి చేస్తుందన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఆగి పోయాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ గా సీపీ.రమేష్ ఎంపిక...!!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 22: రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులుగా కడపజిల్లా.. నుంచి ప్రత్యేక ఆహ్వాన సభ్యులు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ గా సీపీ.రమేష్ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం.. రాష్ట్రంలో ఆహార భద్రత పథకం అమలు, వినియోగదారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించడానికి ఈ కమిటీ దోహదపడుతుంది.. రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు గా నానియామకానికి సహకరించిన కడపజిల్లా కలెక్టర్ చెరుకూరి, జేసీ నిధి మీనా, డీఎస్ఓ, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు అన్న సిపి రమేష్.. కడపజిల్లాలో రేషన్ పంపిణీ, గ్యాస్, పెట్రోల్, నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు పై నిఘా ఉంచి, సక్రమంగా పంపిణీకి నావంతు కృషి చేస్తాను అని తెలియజేస్తున్నాను అన్నారు. ఎటువంటి అవకతవకలు జరిగిన జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకు వెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానని సిపి. రమేష్ మీడియా ద్వారా అధికారులకు, ప్రజలకు తెలియజేస్తున్నాను అన్నారు.

# ఆంజనేయపురం అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ మాసోత్సవాలు'




నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):- పోషణ్ మాసోత్సవాలలో భాగంగా సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే ప్రోగ్రామ్‌లలో భాగంగా మండల సిడిపిఓ డి. శారదాంబ ఆదేశాల మేరకు ఆంజనేయపురం అంగన్‌వాడీ కేంద్రంలో సమాజ భాగస్వామ్యం, జవాబుదారీతనం అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సెంటర్ వంటకాలపై, పిల్లల హాజరు శాతంపై, అలాగే ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సెక్టార్ సూపర్‌వైజర్ బి. రాధిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వివరించారు. మెనూ ప్రకారం వంట చేయాలని, అంగన్‌వాడీ భోజనం ఇంటి భోజనంతో సమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ పి. రమాదేవి, స్థానిక తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# యాదగిరి గుట్ట హుండీ ఆదాయం లెక్కింపు ..



నల్లగొండ (ఇది కద నిజం): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కించారు ఆలయ అధికారులు.... కొండక్రింద సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో జరిపిన హుండీ లెక్కింపులో 33 రోజుల హుండీ ఆదాయం లెక్కించగా 2కోట్ల 59లక్షల3 వేల628 రూపాయల నగదు,32 గ్రాముల మిశ్రమ బంగారం,3కిలోల 950 గ్రాముల వెండి సైతం ఆలయానికి చేకూరినట్లు ఆలయ ఈఓ భవాని శంకర్ తెలియజేశారు... వీటితో పాటు పలు దేశాల నగదు సైతం హుండీ లెక్కింపులో ఆలయానికి వచ్చిందని ఈవో తెలిపారు.. హుండీ లెక్కింపు లో ఆలయ ఈఓ భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి,ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది,,తదితరులు పాల్గొన్నారు...

# యాదగిరీశునికి లక్ష పుష్పార్చన



నల్లగొండ (ఇది కద నిజం): ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహుడికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు..ప్రధానాలయం లోని ముఖమండపంలో నయన మనోహరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు వేద మంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ సహస్రనామలతో లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా చేపట్టారు...వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన కన్నుల పండుగగా చేపట్టారు...లక్ష పుష్పార్చన విశిష్టతను భక్తులకు తెలియజేసారు ఆలయ అర్చకులు...లక్ష పుష్పార్చనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు..

# యాదగిరి కొండపై కారు ఢీకొని వృద్ధురాలు మృతి

## ఆలయ సంప్రోక్షణ చేసిన అర్చకులు



నల్లగొండ (ఇది కద నిజం): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కొండపైన కారు ఢీకొని యాచకురాలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. దర్శనార్థం కొండపైకి వచ్చిన భక్తిని కారు రివర్స్ తీసుకుంటూన్న సమయంలో కారు ఢీకొని కొండపైన భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న యాచకురాలు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది... మృతురాలు యాదగిరిగుట్ట స్థానికురాలు ఈశ్వరమ్మగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. కొండపైన మహిళ మృతి చెందడంతో ఆలయ నియమావళి ప్రకారం అర్చకులు ఆలయ ద్వారాలు మూసివేసి, ఆలయ శుద్ధిచేసి సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.. సంప్రోక్షణ అనంతరం తిరిగి భక్తుల దర్శనాలను పునరుద్ధరించారు..

# రాజోలి, జోలదరాశి ప్రాజెక్టుల నిర్మాణం.. రైతులకు ఎంతగానో అవసరం..!

## మైదుకూరు లో ఈనెల 27 న సాగునీటి ప్రాజెక్టులపై రైతు సదస్సు...

## రాజోలి, జోలదరాశి ప్రాజెక్టుల పూర్తికోసం సదస్సును జయప్రదం చేయాలని రైతు సేవా సమితి పిలుపు..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 22: కడపజిల్లా.. మైదుకూరు పట్టణంలోని రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 27 వ తేదీ మేధా డిఫెన్స్ అకాడమీలో కడపజిల్లాలో సాగునీటి వనరులు, పెండింగ్ ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం అనే అంశంపై జరిగే రైతు సదస్సులో రైతులు, ప్రజాసంఘాలు, రైతు శ్రేయోభిలాషులు భాగస్వాములై జయప్రదం చేయాలని మంగళవారం మైదుకూరు పట్టణంలో రైతు సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రైతు సేవాసమితి కడపజిల్లా అధ్యక్షుడు ఏవి.రమణ, రైతు నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న రమణ మాట్లాడుతూ.. కడపజిల్లా నుండి వందల టీఎంసీల నీళ్లు కుందు, పెన్నానది, సోమశిల ద్వారా మద్రాస్ కు వెళుతున్న.. కడపజిల్లాలో ఉన్న కేసీ కెనాల్, తెలుగుగంగ ఆయకట్టు రైతులకు శ్రీశైలం నీటి మీదనే ఆధారపడి పంటలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితి నుండి పై రెండు ఆయకట్టు రైతులకు నీరు అందించేందుకు ప్రయత్నించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కుందునది పై రాజోలి, జోలదరాశి పేరుతో ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రయత్నించి శంకుస్థాపన కూడా చేసి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కానీ

దురదృష్టవశాత్తు రాజశేఖర్ రెడ్డి మరణించడంతో ఆ తర్వాత రాష్ట్ర ముఖ్య మంత్రులుగా వచ్చి పాలించిన, పాలిస్తున్న వారు ప్రాజెక్టులపై స్పందించకపోవడంతో పై రెండు ప్రాజెక్టుల పనులు ఎక్కడికి, ఆక్కడ నిలిచి పోయాయన్నారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో కడపజిల్లా రైతులకు రాజోలి, జోలదరాశి ప్రాజెక్టుల ఆవశ్యకత ఎంతగానో ఉందనే విషయాన్ని రైతులు అర్థం చేసుకునే పరిస్థితి వచ్చింది అన్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పై రెండు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరతిగతిన పూర్తిచేయాలని రైతు సేవా సమితి ఈనెల 1 వ తేదీ నుండి రైతు గ్రామబాట పేరిట గ్రామ, మండలాల వారిగా తిరుగుతూ రైతులకు రాజోలి, జోలధరాశి ప్రాజెక్టుల ఆవశ్యకత గురించి అవగాహన కల్పిస్తూ మండల రెవెన్యూ కార్యాలయాలలో తాసిల్దార్లకు వినతి పత్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తూ.. కార్యక్రమాలు నిర్వహించాలని, ఈ సమావేశంలో కమిటీ సభ్యుల నిర్ణయించు కోవడమైనది. చివరగా ఈ నెల 27 వ తారీకున మైదుకూరు లో పెద్ద ఎత్తున రైతు సదస్సును నిర్వహించి భవిష్యత్తు కార్యక్రమాల రూపకల్పన చేసుకోవాలని నిర్ణయించుకోవడం జరిగిందని, కావున ఈ రైతు సదస్సుకు ముఖ్య వక్తలు గా రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి, రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షులు హైకోర్టు లాయర్ రామ్ కుమార్ హాజరవు తారన్నారు. కావున రైతులు, రైతు శ్రేయోభిలాషులు, భాగస్వాములై రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సేవా సమితి అధ్యక్షుడు రమణ కోరారు. మంగళవారం జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ నేత రైతు రిటైర్డ్ ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, రైతు సేవా సమితి మైదుకూరు పట్టణ, మండల, నాయకులు రామ్మోహన్, శ్రీనివాసులు, నరసింహులు, ప్రజాసంఘాల నాయకులు సుబ్రహ్మణ్యం, ఎమ్మార్పీఎస్ నాయకులు మిద్దె వెంకటరమణ, హరిబాబు మాజీ సర్పంచ్ ఎల్లంపల్లి సుబ్బారెడ్డి, పప్పనపల్లి నారాయణరెడ్డి, రాజాల రామచంద్రుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# రణబాలి

## మ్యూజికల్ జర్నీ షురూ!




టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి'. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, మేకర్స్ మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ ఫస్ట్ సింగిల్‌ను అధికారికంగా రిలీజ్ చేశారు. సరిగ్గా ఆరు నెలల క్రితం సోషల్ మీడియాలో చిన్న బీట్‌గా వచ్చి విపరీతమైన సెన్సేషన్ క్రియేట్ చేసిన 'ఏందయ్య సామీ' పూర్తి పాటను ఇప్పుడు విడుదల చేయడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సాంగ్ వీడియోను ఒకేసారి రిలీజ్ చేశారు. 'రణబాలి, జయమ్మ ప్రపంచంతో ప్రేమలో పడిపోతారు' అంటూ మేకర్స్ పెట్టిన క్యాప్షన్ సాంగ్‌పై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుల ద్వయం అజయ్-అతుల్ అందించిన మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పల్లెటూరి స్వచ్ఛమైన జానపద శైలిని, ఆధునిక మెలోడీ స్వరాలను అద్భుతంగా మిక్స్ చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. విజయ్ దేవరకొండ, రష్మికల కెమిస్ట్రీ ఈ పాటకు మరింత ప్లస్ అయింది. ప్రస్తుతం సోషల్ మీడియా లో ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ఇక ఇది చూసిన నెటిజన్లు కెమిస్ట్రీ అదుర్స్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## దసరా రేసు నుంచి

# వెంకీ ఔట్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ '#AK47' (ఆదర్శ కుటుంబం). వీరి కాంబో అంటేనే ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకుల్లోనూ అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. అయితే దసరా కానుకగా అక్టోబర్ 2న థియేటర్లలోకి రావాల్సిన ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై మేకర్స్ ఊహించని అప్‌డేట్ ఇచ్చారు. సినిమా రిలీజ్‌ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అభిమానులకు షాకిచ్చారు. ముందుగా ప్రకటించిన తేదీ కంటే వారం రోజులు ఆలస్యంగా, అంటే అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధికారికంగా వెల్లడించింది.

"కాస్త ఆలస్యంగా వస్తున్నాం.. కానీ అందించే వినోదం మాత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ రేంజ్‌లో బద్దలవుతుంది" అని చిత్ర యూనిట్ భరోసా ఇచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో రాజీ పడకూడదనే ఉద్దేశంతో పాటు, పండుగ సెలవులను పకడ్బందీగా ఒడిసిపట్టేలా మేకర్స్ ఈ కీలక మార్పు చేసినట్లు ట్రేడ్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. వెంకటేష్ కెరీర్‌లో 77వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అంతేకాకుండా హీరో నారా రోహిత్ ఒక కీలక పాత్రలో మెరవనుండటం సినిమాపై మరింత హైప్ పెంచుతోంది. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ భారీ ఎంటర్‌టైనర్‌కు ఎస్.తమన్ సంగీతం అందిస్తున్నారు. కుటుంబ కథా చిత్రాలకు తనదైన పంచ్ డైలాగ్స్ జోడించి బాక్సాఫీస్ హిట్స్ కొట్టడంలో త్రివిక్రమ్‌కు తిరుగులేదు. మరి వారం వెనక్కి జరిగిన ఈ '#AK47' దసరా బరిలో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




# నక్క కథ..

## బాలయ్య వాయిస్!

మాలీవుడ్ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ హీరోగా నటిస్తున్న తెలుగు డెబ్యూ ఫిల్మ్ Don`t Trouble the Trouble. ఫాంటసీ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రాన్నిబాహుబలి ఫేం ఆర్కా మీడియా వర్క్స్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. శశాంక్ యేలేటి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు.

ఊరిలో ఒక నక్క ఉండేది.. దానికి రెండు విషయాలు చాలా బాగా తెలుసు.. ఒకటి డబ్బులు.. రెండోది ట్రబుల్ అంటూ బాలకృష్ణ వాయిస్ ఓవర్‌తో షురూ అయింది ట్రైలర్. ఎక్కడ డబ్బులున్నా అది వాసనతో పసిగట్టేసేది.. ఎక్కడ ట్రబుల్ ఉన్నా అది తప్పించుకుని పారిపోయేది.. ఒక రోజు డబ్బులు, ట్రబుల్ ఒకేసారి ఎదురయ్యాయి. నక్కకు డబ్బులు మాత్రమే కనిపించాయి.. కానీ దాని పక్కనే ట్రబుల్ కనిపించలేదు.. అంటూ సాగుతున్న ట్రైలర్ ఫహద్ ఫాసిల్‌తోపాటు సారా పాలేకర్ మధ్య సన్నివేశాలతో కొంచెం ఫన్, కొంచెం సీరియస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తోంది.

ఆర్కా మీడియా వర్క్స్, ఎస్ ఎస్ రాజమౌళి కుమారుడు ఎస్‌ఎస్ కార్తికేయ Showing Business సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్‌ఎస్ రాజమౌళి సమర్పిస్తున్న ఈ మూవీకి కాలభైరవ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 2న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ మూవీని విడుదల చేస్తున్నారు.




## బ్లడ్ బ్యాంక్ వివాదంపై

# మెగాస్టార్ ఫైర్!



మెగాస్టార్ చిరంజీవిపై గత కొంతకాలంగా కొందరు పనిగట్టుకుని నెగెటివిటీని స్ప్రెడ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఎంతో నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్‌పై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ, అక్కడి రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్‌లో పాల్గొన్న చిరంజీవి.. ఈ ఆరోపణలపై స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో ఎన్నో అవమానాలు, విమర్శలు ఎదుర్కొన్నానని చెప్పిన మెగాస్టార్.. బ్లడ్ బ్యాంక్‌పై వస్తున్న విమర్శలు పూర్తిగా అర్థరహితమని కొట్టిపారేశారు.

తాను సినిమాల్లో తీసుకునే భారీ పారితోషికంతో సమానమైన డబ్బులను రక్తం అమ్మడం ద్వారా సంపాదించాలంటే.. అసలు ఎన్ని కోట్ల రక్తం ప్యాకెట్లు విక్రయించాల్సి వస్తుందో ఆ విమర్శలు చేసేవారికి బుద్ధి ఉందా అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఎవరి దగ్గరా ఎలాంటి డొనేషన్లు తీసుకోకుండా కేవలం తన కష్టార్జితంతోనే ఈ బ్లడ్ బ్యాంక్‌ను ఎంతో పవిత్రంగా నడిపిస్తున్నానని చిరంజీవి స్పష్టం చేశారు. అలాంటి సేవా కార్యక్రమంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం కేవలం మూర్ఖత్వమేనని, అందుకే అలాంటి పనికిమాలిన విమర్శలను తాను ఎప్పుడూ పట్టించుకోనని తేల్చిచెప్పారు.

# కర్ణుడిగా రాఘవ లారెన్స్




డైరెక్టర్ రమేష్ వర్మ తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'మహావీర్ కర్ణ'. ఈ భారీ చిత్రంలో రాఘవ లారెన్స్ కర్ణుడి పాత్రలో నటిస్తున్నారు. తాజాగా మేకర్స్ విడుదల చేసిన లారెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ 'పెన్ మూవీస్' ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. ఒక ముఖం, ఒక లెజెండ్, ఒక యోధుడు అంటూ అంచనాలను పెంచేశారు. ఇక ఈ విషయంపై రాఘవ లారెన్స్ స్పందిస్తూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన కెరీర్‌లో ఫస్ట్ టైమ్ పురాణ పాత్రలో నటిస్తున్న లారెన్స్.. ఈ ప్రాజెక్ట్ గురించి స్పందిస్తూ.. "మన పురాణాల్లోని అత్యంత శక్తివంతమైన, లెజెండరీ పాత్ర అయిన కర్ణుడి పాత్రలో నటించడం నాకు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఈ స్క్రిప్ట్ నా దగ్గరకు వస్తుందని నేను అసలు ఊహించలేదు. ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రమేష్ వర్మకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఎంతో వినయంతో, కృతజ్ఞతా భావంతో ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాను. మీ అందరి ఆశీస్సులు, సపోర్ట్ నాకు ఎప్పుడూ ఉండాలి" అంటూ లారెన్స్ రాసుకొచ్చారు.

గౌరవం, విధి, విధేయత, త్యాగానికి ప్రతిరూపమైన యోధుడు కర్ణుడి పాత్రలో లారెన్స్ లుక్ అద్భుతంగా ఉందని నెట్టింట సినీ ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. కాగా.. పెన్ మూవీస్ జయంతిలాల గడా, ఆర్‌వి స్టూడియోస్, శ్రీ నీలద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను దాదాపు 150 కోట్ల భారీ బడ్జెట్‌తో ఐదు భాషల్లో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ తెరకెక్కిస్తున్నారు. భారీ సెట్లు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ సినిమాను ఒక విజువల్ వండర్‌గా మలుస్తున్నారట మేకర్స్. రాఘవ లారెన్స్ లీడ్ రోల్‌లో వస్తున్న ఈ ఎపిక్ యాక్షన్ సాగా వచ్చే ఏడాది ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతుంది.